


జిల్లా ఓటర్లు 13,92,036

ఓటర్ల తుది జాబితా వెల్లడించిన అధికారులు

నంద్యాల కల్చరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఓటర్ల తుది జాబితా-2025 విడుదలైంది. జిల్లా వ్యాప్తంగా 13,92,036 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల వారీగా వివరాలు వెల్లడయ్యాయి. నూతన జాబితా తయారీలో భాగంగా గతేడాది ఆగస్టు 20 నుంచి అక్టోబరు 18 వరకు బీఎల్వోలు ఇంటింటి సర్వే నిర్వహించారు. మృతులు, వలస ఓటర్ల తొలగింపుతో పాటు ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువకులకు కొత్తగా ఓటు హక్కు కల్పించేందుకు ఫారం-6 ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. రెండు నెలల పాటు కొనసాగిన సర్వేతో పాటు ఆన్‌లైన్‌లో వచ్చిన క్లెయిమ్‌లపైనా విచారణ చేపట్టారు. ఆ వివరాలతో గతేడాది అక్టోబరులో ముసాయిదా జాబితా



విడుదల చేశారు. దీనిపై వచ్చిన అభ్యంతరాలతో పాటు కొత్తగా చేర్పులు, తొలగింపునకు వచ్చిన దరఖాస్తులను విచారించిన జిల్లా ఎన్నికల అధికారులు సోమవారం తుది జాబితాను ప్రచురించారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్ తుది ఓటర్ల జాబితా పత్రాలను రాజకీయపార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,629 పోలింగ్ స్టేషన్ల పరిధిలో పురుష ఓటర్లు 6,81,581 మంది, మహిళా ఓటర్లు 7,10,193 మంది, ఇతరులు 262 మంది ఉన్నారన్నారు. అన్ని నియోజవర్గాల పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఈఆర్వోలు తుది ఓటర్ల జాబితాను విడుదల చేసి ప్రదర్శిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగపు సూపరింటెండెంట్ జయప్రసాద్, రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉమూమి తబ్లిగీ ఇజితెమా

- నాలుగు జిల్లాల నుంచి హాజరుకానున్న ముస్లింలు
- మూడు రోజుల పాటు ఆధ్యాత్మిక ప్రసంగాలు
- రెండు లక్షలకు పైగా ముస్లింలు హాజరయ్యే అవకాశం
- రూ.10కోట్ల ఖర్చుతో వంద ఎకరాల్లో ఏర్పాటు
- 572 మంది పోలీసులతో పహారా



ఇజితెమాకు చేపట్టిన భారీ ఏర్పాట్లు

ఆత్మకూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు కేంద్రంగా మంగళవారం నుంచి ఉమూమి తబ్లిగీ ఇజితెమాకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. జనవరి 7,8,9 తేదీల్లో మూడు రోజుల పాటు జరిగే ఈ ఇజితెమా కార్యక్రమానికి కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల నుంచి సుమారు రెండు లక్షలకు పైగా ముస్లింలు హాజరయ్యే అవకాశం



ఇజితెమా ప్రాంతాన్ని సుందరీకరిస్తున్న దృశ్యం

వుంది. 2019 డిసెంబరులో కర్నూలు కేంద్రంగా అంతర్జాతీయ స్థాయిలో ఆలమి ఇజితెమా జరిగింది. ఆ తర్వాత ఇంతటి భారీ స్థాయిలో ఆత్మకూరులో ఉమూమి తబ్లిగీ ఇజితెమా జరగడం విశేషం. కాగా మూడు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమానికి నెల రోజుల నుంచే భారీ ఏర్పాట్లను కొనసాగించారు. రూ.10 కోట్లతో 300 ఎకరాల్లో ఈ కార్యక్రమం జరగనుంది. ఇందులో 100 ఎకరాలు ఇజితెమా వేదికగా నిర్ణయించగా మరో 200 ఎకరాలు పార్కింగ్, ఇతర సదుపాయాలకు కేటాయించారు. కాగా ఆయా రహదారుల మీదుగా వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏడు చోట్ల పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. 17 భోజన కౌంటర్లను ఏర్పాటు చేసి ఒక్కో కౌంటర్ వద్ద 10వేల మందికి భోజన సదుపాయాన్ని కల్పించారు. ప్రతిరోజు 80లక్షల లీటర్ల నీటిని అందుబాటులో ఉంచడంతో పాటు 5వేల మరుగుదొడ్లను, స్నానపు గదులను, భారీ ఫ్లడ్‌లైట్లను, చలువ పందిళ్లను సిద్ధం చేశారు. రూ.2కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయగా మిగతా మొత్తాన్ని కమిటీ సమకూర్చుకుంది.

మూడు రోజుల పాటు ఆధ్యాత్మిక వేడుక

మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలో భాగంగా తొలిరోజైన మంగళవారం ఉదయం ఒంటి గంటకు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా ఢిల్లీ, హైదరాబాద్‌కు చెందిన సుమారు 20 మంది ఉలేమాలు రాత్రి 9గంటల వరకు ఇజితెమా కార్యక్రమం సందర్భంగా ఆధ్యాత్మిక ప్రసంగాలను ఇవ్వనున్నారు. 8,9 తేదీల్లో ఉదయం 6గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ఆధ్యాత్మిక ప్రసంగాలు, మహ్మద్ ప్రవక్త నిర్దేశించిన మార్గదర్శకాలను ఉలేమాలను వివరించనున్నారు. ఈక్రమంలోనే ఒకన్నటి లక్ష మంది ముస్లింలు ఇదే వేదికగా ఐదు పూటలు నమాజలను అక్కడే జరుపుకునేలా వెసులుబాటు కల్పించారు. అదేవిధంగా కాలకృత్యాలు, అల్పాహారం, భోజనం తదితర వాటి కోసం మధ్యమధ్యలో విరామం ఇస్తారు. తొలిరోజు ఆరంభ వేడుకలో రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా హాజరుకానున్నారు.

భారీగా పోలీస్ బందోబస్తు

ఇజితెమాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 575 మంది పోలీసులను ఆత్మకూరుకు తరలించారు. ఒక ఏఎస్పీ, నలుగురు డీఎస్పీలు, 20 మంది సీఐలు, 40 మంది ఎస్ఐలు, సుమారు 500 మంది పోలీసు సిబ్బంది ఇజితెమాను పర్యవేక్షించేలా ప్రణాళిక రూపొందించారు. అలాగే పోలీసు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి 91 సీసీ కెమెరాలతో నిఘా ఉంచారు.



పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్

రూ.50 కోట్లతో రింగ్ రోడ్డు

- బనగానపల్లె ప్రజల ఆకాంక్ష నెరవేరుస్తాం
- పనులను ప్రారంభించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



పాణ్యం రహదారిలో రింగ్ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె, జనవరి 6, (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా బనగానపల్లె ప్రజలు ఎదురుచూస్తున్న ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని ఏడాదిన్నరలో పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. రూ.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రింగ్ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రింగ్ రోడ్డు నిర్మాణం ఉనికిలేకుండా చేశారన్నారు. కనుమరుగైన రింగ్ రోడ్డు పనులను సీఎం చంద్రబాబునాయుడు ఆశీస్సులతో తిరిగి పునఃప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆర్అండ్‌బీ అధికారుల సహకారంతో ఏడాదిన్నర కాలంలో రింగ్ రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు కానుకగా అందిస్తామన్నారు. బనగానపల్లె రింగ్ రోడ్డును 14.5 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్నట్లు తెలిపారు. నేషనల్ హైవే అథారిటీ పరిధిలో 4.5 కిలోమీటర్లు, ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో 11 కిలో మీటర్ల మేర నిర్మాణం పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే భూసేకణ పనులు పూర్తయ్యాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు రాష్ట్రాన్ని గుంతల రహిత రహదారులే లక్ష్యంగా రూ.861 కోట్లతో చేపట్టిన రోడ్లను గుంతలు పూడ్చే మరమత్తు పనులు సగం పూర్తయ్యాయన్నారు. జనవరి చివరికి మరమతు పనులు పూర్తి చేస్తామని బీసీ తెలిపారు. త్వరలో పీపీపీ విధానంలో 3వేల కిలోమీటర్ల రహదారుల నిర్మాణం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ నయీముల్లా, ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈ సునీల్‌రెడ్డి, ఏఈ హుసేన్, టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి, ఉపసర్పంచ్ బురానుద్దీన్, గాలిమద్దిలేటిరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, ఉగ్రసేనారెడ్డి, సర్పంచులు తులసిరెడ్డి, మహేశ్వర రెడ్డి రామకృష్ణాపురంశంకర్, లక్ష్మీకాంతరెడ్డి, బత్తుల భాస్కర్‌రెడ్డి, తిరుమ లయ్య, కలాం, నియాజ్, కృష్ణానాయక్, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రస్తా కోసం ఆందోళన

జాతీయ రహదారిపై ఎద్దుల బండ్లను, ట్రాక్టర్లను అడ్డం పెట్టిన రైతులు

నందికొట్కూరు రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి) : పొలాలకు వెళ్లేందుకు రహదారి లేకుండా చేశారని, వెంటనే రస్తా ఏర్పాటు చేయాలని 10 బొల్లవరం రైతులు ఆందోళనకు దిగారు. సోమవారం జాతీయ రహదారి 340 సీ 21వ కిలోమీటర్ వద్ద ఎద్దుల బండ్లను, ట్రాక్టర్లను అడ్డుపెట్టి వచ్చిపోయే వాహనాలను అడ్డుకున్నారు. 10 బొల్లవరం రైతులు తమ పొలాలకు వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు వెనక్కి నందికొట్కూరు సమీపంలో వున్న నాగలూటి యూ టర్న్ వద్దకు వెళ్లి తిరిగి రావలసి వస్తున్నది. దీనితో రైతులు తమ వూరి వద్ద డివైడర్‌ను తొలగించి ఎప్పటిలానే పొలాలకు దారి వదలాలని కోరుతూ నిరసన తెలిపారు. దీనితో కొద్దిసేపు జాతీయ రహదారిపై వాహనాల రాక పోకలకు అంతరాయం కలిగింది. ఈ విషయం తెలుసుకున్న జాతీయ రహదారి సైట్ మేనేజర్ వాసు, తహసీల్దార్ శ్రీనివాసులు, బ్రాహ్మణకొట్కూరు ఎస్సై తిరుపాలు వచ్చి రైతులకు సర్ది చెప్పడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు బాబురెడ్డి, వెంకటేశ్వర్లు, ఎల్లప్ప, దేవేంద్రరెడ్డి, మేకల మల్లయ్య, లక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.



బొల్లవరం వద్ద జాతీయ రహదారి 340 సీపై ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లను అడ్డం పెట్టి అడ్డుకున్న గ్రామస్థులు

ఫిర్యాదుల పరిష్కారంపై శ్రద్ధ పెట్టండి: కలెక్టర్

నంద్యాల కల్చరల్, జనవరి 06 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను పరిష్కరించడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కారవేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల ద్వారా స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా చదివి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. 24గంటలలోపు పరిష్కరించాల్సిన మూడు ఫిర్యాదులు, 34 రీఓపెన్ అయిన ఫిర్యాదులు, 20 సీఎంఓ కార్యాలయపు ఫిర్యాదులు, ఇంకా బియాండ్ ఎస్ఎల్ఏలో ఉన్న అర్జీలపై తక్షణమే స్పందించి క్లియర్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ మాట్లాడుతూ బండి ఆత్మకూరు, పాములపాడు, జూపాడుబంగ్లా, బనగానపల్లి, సంజామల మండలాలలో పెండింగ్‌లో ఉన్న ఫ్రీహోల్డ్ భూముల డేటాను క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేయాలని ఆర్డీఓ, సంబంధిత తహసీల్దార్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 170 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



తొమ్మిది మంది సీఐల బదిలీ

కర్నూలు క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల, కర్నూలు జిల్లాల పరిధిలో 9 మంది సీఐలు బదిలీ అయ్యారు.

సీఐ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కంబగిరి రాముడు	ఆళ్లగడ్డ రూరల్	నంద్యాల త్రీటౌన్
ఎస్.సూర్య మౌళి	నంద్యాల త్రీటౌన్	ఎస్‌బీ-2, నంద్యాల
ఎస్.అస్రార్ బాషా	ఎస్‌బీ-2, నంద్యాల	సీసీఎస్-2 కర్నూలు
డి.మురళీధర్ రెడ్డి	సీసీఎస్-2, కర్నూలు	ఆళ్లగడ్డ రూరల్
ఎస్.తేజోమూర్తి	వీఆర్, కర్నూలు	ఎస్‌బీ-1, కర్నూలు
జి.ప్రసాద్	ఎస్‌బీ-1, కర్నూలు	వీఆర్, కర్నూలు
డి.భాస్కర్ రెడ్డి	డీసీఆర్‌బీ, కడప	డీఎస్‌బీ-2, కడ
యు.వెంకట కుమార్	వీఆర్, కడప	డీసీఆర్‌బీ, కడప
వి.వేణుగోపాల్	వీఆర్, కడప	ఎస్సీ, ఎస్టీ సెల్, కడప

తెలియనితనం...!

- పెట్రోల్‌తో ఆటలాడిన ఇద్దరు చిన్నారులు
- మంటలు వ్యాపించి ఓ బాలుడికి తీవ్ర గాయాలు
- ఆస్పరి మండలం బిల్లేకల్లులో ఘటన

7

ప్రారంభోత్సవానికి సిద్ధం

నంద్యాల రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల రూరల్ రెవెన్యూ కార్యాలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ కార్యాలయం ప్రారంభమైతే రెవెన్యూ సిబ్బంది మీద పని ఒత్తిడి తగ్గడంతో పాటు ప్రజలకు సేవలు వేగంగా అందే అవకాశం ఉంది. ఇన్నేళ్లుగా నంద్యాల, రూరల్ కలిపి ఒకే రెవెన్యూ కార్యాలయం ఉండేది. జిల్లా కేంద్రమైన నంద్యాలలో జనాభా పెరగడంతో వివిధ రంగాలలో వచ్చిన మార్పులు అవసరాల నేపథ్యంలో రెవెన్యూ కార్యాలయంపై పని ఒత్తిడి పెరిగింది. దీంతో రెవెన్యూ కార్యాలయాన్ని అర్బన్, రూరల్ కార్యాలయాలుగా విభజించాలని అధికారులు నిర్ణయించారు. ఆమేరకు ప్రస్తుతం ఉన్న రెవెన్యూ కార్యాలయ వెనక ప్రాంతంలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న భవనం రూరల్ తహసీల్దార్ కార్యాలయంగా ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ప్రస్తుతం నంద్యాల రూరల్ పరిధిలోకి 13 గ్రామాలు రానున్నాయి. మంగళవారం రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ఇదిలా ఉండగా నూతనంగా ఏర్పడిన కార్యాలయానికి తహసీల్దార్‌గా ఎస్సార్బీసీ భూ సేకరణ విభాగంలో డీటీగా పనిచేస్తున్న సత్య శ్రీనివాసులు నియమితులయ్యారు.



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న రూరల్ రెవెన్యూ కార్యాలయం

జింక్ లోపాన్ని సవరించాలి

- అప్పుడే అధిక దిగుబడి
- వరి, వేరుశనగ, శనగ, మిరప పంటల్లో జింక్ లోపం



గోనెగండ్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రబీ పంటలకు జింక్ లోపం ఎక్కువగా ఉంటుంది. దీన్ని గుర్తించి లోపాలను సరిచేసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చు. లేదంటే దిగుబడి తగ్గిపోతుంది. గింజ సన్నగా ఉంటుంది. ధర కూడా పలకదు. కాబట్టి రబీలో రైతులు జింక్ లోపం గుర్తించి చర్యలు తీసుకోవడం ఎంతో ముఖ్యం. ఉమ్మడి జిల్లాలో రబీ సాగు కింద 1,17288 హెక్టార్లు సాగు కావాల్సి ఉండగా ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గింది. కేవలం 76,027 హెక్టార్లు మాత్రమే సాగు అయింది. వరి, వేరుశనగ, శనగ, మిపర పంటలలో జింక్ లోపం ఎక్కువ గా కనిపిస్తుంది. దీంతో ఆకులు రంగు మారిపోవడం, పెరుగుదల తగ్గిపోవడం జరుగుతుంది. ఇక ఎక్కువగా వరిలో ఈ జింక్ ప్రభావం ఎక్కువ కనిపిస్తుంది.

పంటలపై జింక్ ప్రభావం


- వరి, వేరుశనగ, శనగ, మిరపతో పాటు ఇతర పంటలో కూడా జింక్ ఆవశ్యకత ఎక్కువగానే ఉంటుంది. పైర్లు పచ్చగా ఎదిగి బాగా దుబ్బు చేయడానికి జింక్ పోషకం ఎంతో తోడ్పడుతుంది.
- మొక్కలో మాంసకృత్తులు, అమినో ఆమ్లాలు తయారీకి నత్రజని, భాస్వరం, పోషకాల సమర్ధ వినియోగానికి జింక్ తోడ్పడుతుంది.
- మొక్క పెరుగుదలకు కావాల్సిన ఇండోల్ అసిటిక్ ఆమ్లం ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషిస్తుంది.
- పత్రహరితంలో జింక్ ముఖ్య ధాతువుగా కిరణజన్య సంయోగ క్రియకు, తద్వార ఆహార ఉత్పత్తికి ఉపయోగపడుతుంది.



జింక్ లోపం వల్ల మచ్చలు వచ్చిన వరి ఆకులు

జింక్ లోపానికి ప్రధాన కారణాలు

- సేంద్రియ ఎరువులు తగిన మోతాదులో వాడకపోవడం
- సరిగా మగ్గని పశువుల ఎరువులు వేసిన నేలలో కూడా జింక్ లోపం వస్తుంది
- భూమిలో క్షారగుణాలు, సున్నపు పాళ్లు ఎక్కువగా ఉండటం
- ఏడాది పొడువునా నీరు నిల్వ ఉంటూ మురుగుపోకుండా ఉండటం
- ఉదజని సూచిక 8 కంటే ఎక్కువగా ఉండటం
- కొత్తగా అచ్చుకట్టిన పొలాల్లో ఈ లోపం కనిపిస్తుంది
- భాస్వరం ఎక్కువగా ఉన్న నేలలు
- చలి వాతావరణంగల రబీ కాలంలో జింక్ లోపం ఎక్కువగా ఉంటుంది.



జింక్ లోపం ఉన్న శనగ పంట

వరిలో జింక్ లోప లక్షణాలు

- వరిలో జింక్ లోపం నాటిన 2 నుంచి 6 వారాల మధ్య కనిపిస్తుంది.
- మొక్కలలో పెరుగుదల ఆగిపోయి గిడస బారతాయి.
- వేరు సరిగా వృద్ధి చెందవు
- పిలకలు రావడం తగ్గుతుంది
- మొక్కల మధ్య ఆకుల్లో ఈనెల మధ్య భాగంలో పసుపు రంగులోకి మారుతుంది. మిగిలిన ఆకు అంచులు పచ్చగానే ఉంటాయి.
- ముదురు ఆకుల చివర్లో మచ్చలు కనిపిస్తాయి. ఆకులు పెళుసుగా ఉండి సులభంగా విరిగిపోతాయి.
- మొక్కలు పొట్టిగా గుబురుగా ఉండి, వెన్నులు ఆలస్యంగా వస్తాయి. మిగతా యాజమాన్య పద్ధతులు పాటించినా జింక్ లోపంతో దిగుబడి బాగా తగ్గిపోతుంది.



జింక్ లోపం ఉన్న వరి పంట

జింక్ నివారణకు అధికారుల సలహాలు అవసరం



రబీ సీజన్‌లో చలి ఎక్కువగా ఉంటుంది. పంట పొలాలలో జింక్ లోపం ఎక్కువగా కనిపిస్తుంది. ఈ సమస్యను పరిష్కరిస్తే పంట దిగుబడి కూడా ఎక్కువగా వస్తుంది. వరి, వేరుశనగ, శనగ, మిరప పంటలతో పాటు మిగతా పంటలలో కూడా జింక్ నివారణ కోసం రైతులు స్థానికవ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలి.

-మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు.

జింక్ లోపం నివారణ చర్యలు:

- ఇంకా వరినాట్లు వేయని రైతులు దుక్కిలో జింక్ వేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. ఆఖరి దమ్ముకు ముందు, ఎకరానికి 20కిలోల జింక్ సల్ఫేట్‌ను వేసి కలియదున్నాలి. పంటను నాటే ముందు పొలానికి వేసే భాస్వరం కలిగిన కాంప్లెక్స్ ఎరువులతో జింక్‌ను కలిపి వేయరాదు. అలా చేస్తే భూమిలో జింక్ మొక్కలకు అందని స్థితిలోకి మారిపోతుంది.
- మురుగునీరు సరిగాపోని పొలాలల్లో నాట్లు వేసిన 2 వారాల తరువాత పొలంలో నీటిని పూర్తిగా బయటకు తీసి తర్వాత కొత్తగా నీరు పెట్టడం వల్ల మొక్కలకు భూమి నుంచి జింక్ లభ్యత పెరుగుతుంది.
- చౌడు భూములలో మొదటి దఫాపై పాటు యూరియాకు ఆమ్లగుణం ఉంటుంది. దీని వల్ల భూమిలో చౌడు గుణం తగ్గి జింక్ అందుతుంది.
- పైరులో జింక్ లోపం కనిపించిన వెంటనే లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్, 5 గ్రాముల యూరియాను కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేస్తే మంచి ఫలితం ఉంటుంది.



జింక్ లోపం ఉన్న వేరుశనగ పంట

స్నాతకోత్సవ బంగారు పథకాలకు సహకరించండి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్

కర్నూలు అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీ మొదటి స్నాతకోత్సవానికి బంగారు పతకాలు ఇచ్చే దాతలను ఆహ్వానిస్తున్నామని రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిగ్రీ, పీజీ విద్యార్థులు కలిపి 866 మందికి డిగ్రీ ప్రదానం చేయబోతున్నామన్నారు. విద్యార్థులకు బహుమతిగా ఇవ్వడానికి దాతలు, పూర్వ విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, ఆసక్తి గల వారి నుండి బంగారు పతకాలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ప్రథమ స్థానంలో వచ్చిన బీఎస్సీ, బీకాం, బీఏ విద్యార్థులకు ఇవి ఇస్తామని తెలిపారు. దాతలు క్లస్టర్ వర్శిటీ అధికారులను సంప్రదించాలని కోరారు.

పేద కళాకారులకు అండగా ఉంటా

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



కళాకారుని కుటుంబ సభ్యులకు రూ.30 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పేద కళాకారులకు ఎప్పుడూ అండగా ఉంటానని, టీజీవీ కళాక్షేత్రం కళాకారుల అభివృద్ధికి కృషి చేస్తుందని ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. సోమవారం సాయంత్రం నగరంలోని మౌర్యఇన్‌లో గల ఆయన కార్యాలయంలో ఇటీవల అనారోగ్యానికి గురై, ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న రంగస్థల నటుడు సామ్యూల్ కుటుంబానికి ఆయన రూ.30 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా ఆసుపత్రిలో సామ్యూల్‌కు అవసరమైన వైద్య సౌకర్యాలు సమకూరుస్తానని హామీ ఇచ్చారు. రాబోయే కాలంలో పేద, వృద్ధ కళాకారులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కర్నూలుకు చెందిన కళాకారుడు సామ్యూల్ రాష్ట్రంలోనే నారద పాత్రకు పేరున్న నటుడని అన్నారు. ఆయన ప్రమీలార్జున పరిణయం నాటకంలో నారద పాత్రకు అలాగే సైరా నరసింహారెడ్డి నాటకంలోని అనుచరుని పాత్రకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రెండు నంది అవార్డులు అందుకున్నారని గుర్తు చేశారు. నటన, గాత్రంతో ప్రేక్షకులను మైమరపించే సామ్యూల్ అనారోగ్యంపాలు కాడం దురదృష్టకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సామ్యూల్ కుటుంబ సభ్యులతోపాటూ కళాక్షేత్రం సహాయ కార్యదర్శి పి. రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన టీజీ భరత్



కేంద్ర మంత్రిని కలిసిన మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర భా రీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమార స్వామి, ఉక్కు శాఖ కార్యదర్శితో రాష్ట్ర మంత్రి టీజీ భరత్ సమావేశ మయ్యారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో అర్సె లాల్ మిట్టల్‌కు ఐరన్ ఖనిజం సరఫరాపై చర్చించారు. ఒప్పందం సులభతరం చేయడంలో సహకరించినందుకు మంత్రికి కృత జ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులపై డీఈఓ అసంతృప్తి



పాణ్యంలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ

పాణ్యం, జనవరి6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు సమయానికి రాని ఉపాధ్యాయులపై డీఈఓ జనార్దన్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ఆయన పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టడీ అవర్స్‌కు ఆలస్యంగా వచ్చిన ఉపాధ్యాయులు ప్రసాద్, ధనలక్ష్మిలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా ఉండడం సరికాదన్నారు. స్టడీ అవర్‌కు తక్కువ మంది విద్యార్థులు హాజరు కావడంపై హెచ్‌ఎంను ప్రశ్నించారు. ఇద్దరు తెలుగు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ప్రార్థనా సమయానికి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మేరీసునీత, ఎంఈఓ కోటయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కోర్టు గోడ దూకి...

- పోలీసుల నుంచి అంతర్రాష్ట్ర దొంగ పరార్
- గాలించినా లభ్యం కాని దొంగ ఆచూకీ..



తాలుకా పోలీసుల అదుపులో దొంగ (ఫైల్)

ఆదోని రూరల్/ ఆదోని ,జనవరి6(ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు కోర్టుకు తరలిస్తుండగా ఖాకీల కళ్లు కప్పి .. కోర్టు గోడదూకి దొంగ పరారయ్యాడు. ఈ ఘటన సోమవారం ఆదోనిలో చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా మోహినాబాద్ మండలం సూరగాలి గ్రామానికి చెందిన మురళిపై ఏపీతోపాటు పక్క రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో దొంగతనాల కేసులు నమోదయ్యాయి. ఆదోని టూటౌన్‌లో కూడా ఇతనిపై గతంలో దొంగతనం కేసు ఉంది. రెండు రోజుల క్రితం ఆదోని శివార్లులోని ఎమ్మిగనూరు బైపాస్‌లోని ఓ పాల డెయిరీలో దూరి రూ 10వేల నగదును దొంగలించి, సమీపంలోని సత్యప్ప అనే వ్యక్తి ఇంట్లోకి చొరపడ్డాడు. సత్యప్ప దొంగను వెంటాడి పట్టుకొని తాలుకా పోలీసులకు అప్పగించాడు. మురళి చేసిన దొంగతనం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి రావడంతో తాలుకా పోలీసులు ఆ దొంగని త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు. అయితే సోమవారం దొంగను కోర్టుకు తరలిస్తుండగా కోర్టు ఆవరణలో పోలీసుల కళ్లు కప్పి కోర్టు గోడ దూకి పరార్యయాడు. పోలీసులు రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో ముమ్మరంగా గాలింపు చేపట్టారు. కానీ రాత్రి 10 గంటలు దాటినా దొంగ ఆచూకీ లభ్యం కాలేదు. అంతర్రాష్ట దొంగను కోర్టుకు తరలించే క్రమంలో పోలీసులు ఎలాంటి జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే దొంగ పరారైనట్లు కోర్టులో స్థానికులు తెలిపారు.

కోర్టు దగ్గర దొంగ తప్పించుకున్నాడు..

రెండు రోజుల క్రితం పాల డెయిరీలో దొంగతనం చేసిన మురళిని సోమవారం స్టేట్ బ్యాంకు కాలనీలో అరెస్ట్ చేశాం. 41 నోటీస్ ఇచ్చి కోర్టు దగ్గరకు తీసుకెళ్లగా అక్కడ తప్పించుకున్నాడు. మా సిబ్బంది వెతుకుతున్నారు.

-శివభూషణం, హెడ్ కానిస్టేబుల్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్

తప్ప తాగి కారు డ్రైవింగ్

- ఎస్సార్బీసీ కాలువలోకి దూసుకెళ్లిన సుమో
- రైతులు గమనించడంతో తప్పిన పెను ప్రమాదం
- ఆరుగురు విద్యార్థినులతోపాటు బాలిక తండ్రి క్షేమం



ఎస్సార్బీసీ కాల్వలో పడ్డ సుమో కారులో ఉన్న బాలికలను బయటకు తీసుకు వస్తున్న దృశ్యం

బనగానపల్లె, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి కారు నడపడంతో ఎస్సార్బీసీ కాలువలోకి దూసుకెళ్లింది. అందులో ఉన్న ఆరుగురు విద్యార్థులతో సుమో వాహనం నడుపుతున్న వ్యక్తి క్షేమంగా బయపడ్డారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్టయింది. బనగానపల్లె పట్టణంలోని తెలుగుపేటకు చెందిన నడిపి నాగయ్య కుమారుడు జక్కు సురేశ్ సోమవారం ఫుల్లుగా మద్యం సేవించాడు. అనంతరం సుమో వాహనం తీసుకొని తన కూతురు సాయిచంద్రిక చదువుతున్న బనగానపల్లె బాలికల ఉన్నత పాఠశాల వద్దకు వెళ్లాడు. 8వ తరగతి చదువుతున్న తన కూతురితోపాటు మరో ఐదుగురు విద్యార్థినులను సుమో వాహనంలో ఎక్కించుకున్నాడు. సుమోలో పాటలు పెట్టి ఎస్సార్బీసీ కాలువ కట్టపై అతివేగంగా నడిపాడు. దీంతో సుమో వాహనం అదుపు తప్పి ఎస్సార్బీసీ కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ విషయం సీఐ ప్రవీణ్‌కుమార్‌కు తెలియడంతో వెంటనే ఎస్సార్బీసీ కాలువ వద్దకు చేరుకున్నారు. అప్పటికే చుట్టుపక్కల ఉన్న రైతులు అక్కడికి చేరుకొని విద్యార్థినులను వాహనం టాప్‌పైకి ఎక్కించారు. ఆ తరువాత ఈత గాళ్లు రావడంతో వారిని తాళ్ల సహాయంతో క్షేమంగా ఎస్సార్బీసీ కాలువ నుంచి బయటకు చేర్చారు. నీరు తక్కువగా ఉండడంతో ఎవరికీ ప్రమాదం సంభవించలేదు. అదృష్టవశాత్తు కాలువలో నీరు తక్కువ పారడం, కారు బోల్తా పడకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని సీఐ తెలిపారు. అనంతరం జక్కు సురేశ్‌పై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

సమాజాభివృద్ధిలో మేధావులు భాగం కావాలి

'ఫిరా' జాతీయ ఉపాధ్యక్షుడు జేవీ కృష్ణయ్య



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాహితం సంస్థ ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మేధావి వర్గాలు ముందుకు వచ్చి, సమాజాభివృద్ధిలో భాగం కావాలని, ఈ నేపథ్యంలోనే 'ప్రజాహితం వేదిక' అనే సంస్థ కృషి చేస్తుందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రేషనలిస్టు అసోసియేషన్ (ఫిరా) జాతీయ ఉపాధ్యక్షుడు జేవీ కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో జేవీ కృష్ణయ్య రాసిన 'హేతువాదం వ్యక్తిగత అభివృద్ధికి, సామాజిక అభివృద్ధికి తోడ్పడుతుందా?' పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో పదవీ విరమణ చేసిన ప్రముఖులతో 'ప్రజాహితం వేదిక' అనే సంస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా జేవీ కృష్ణయ్య మాట్లాడుతూ వైద్య, విద్య రంగాలతోపాటూ వివిధ రంగాల్లో పదవీ విమరణ చేసిన మేధావులతో ప్రజాహితం వేదిక ఏర్పాటు చేశామని తెలిపారు. తమ వ్యక్తిగత జీవితంలో సంతోషంగా జీవించడంతోపాటు సమాజానికి తాము ఏదైనా చేయాలన్న తలంపు ఉన్న విశ్రాంత మేధావి వర్గాలతో ఈ సంస్థ ముందుకు పోతుందని చెప్పారు. కర్నూలుకు చెందిన న్యాయవాది మురళీమోహన్ కన్వీనర్‌గా, కర్నూలు సర్వజన వైద్యశాల విశ్రాంత వైద్యుడు డాక్టర్ రామగోపాల్ కో కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు.



వంద మీటర్ల పరుగును పరిశీలిస్తున్న ఎస్పీ జి. బిందుమాధవ్



ఒక్క నిమిషం ఊపిరి పీల్చుకుంటూ..



హమ్మయ్య దూకేశా..

ఉద్యోగమే లక్ష్యంగా...

- కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు
- ఆరో రోజు 241 మంది అర్హులు

కర్నూలు క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా అభ్యర్థులు కష్టపడుతున్నారు. కర్నూలు నగరంలోని ఏపీఎస్పీ బెటాలియన్‌లో సోమవారం ఆరో రోజు పోలీసు కానిస్టేబు ళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు కొనసాగాయి. ఈ పరీక్షలకు జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ హాజరై పర్యవేక్షించారు. 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 332 మంది అభ్యర్థులు బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, చాతి ఫిజికల్ కొలతలు నిర్వహించారు. అనంతరం వీరికి నిర్వహించిన ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు 1.600 మీటర్ల పరుగు పరీక్షలో 269 మంది అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగులో 175 మంది అర్హత సాధించగా లాంగ్‌జంప్‌లో 232 మంది అర్హత పొందారు. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు 6వ రోజు 241 మంది అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు క మాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషినల్ ఎస్పీ అడ్మిన్ జి.హుశేన్ పీరా, ఏఆర్ అడిషినల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగే దొంగ..?

- నగర పాలక సంస్థలో ఏసీని తెచ్చిపెట్టిన వైనం
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



చోరీకి గురైన ఏసీ ఇదే..

కర్నూలు న్యూసిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలోని జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీ విభాగంలో మాయమైన ఏసీని అక్కడ పని చేస్తున్న ఉద్యోగే దొంగతనం చేశాడని తేలింది. నగర పాలక సంస్థలో ఏసీ చోరీపై ఆంధ్రజ్యోతిలో ఈ నెల 3న వార్త ప్రచురితమైన సంగతి విదితమే. దీంతో సదరు ఉద్యోగి సోమవారం ఉదయమే నగర పాలక ఆవరణలో ఏసీని పెట్టి వెళ్లిపోయాడు. ఈ ఘటనపై ఇప్పటికే పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగే ఈ పని చేసినట్లు నిర్ధారణకు వచ్చిన అధికారులు ఏసీని యథాస్థానంలో ఉంచాలని ఆదేశించినట్లు సమాచారం. దీంతో గత ఆదివారం ఏసీని చోరీ చేసిన ఉద్యోగి సరిగ్గా వారానికి తిరిగి నగర పాలక సంస్థలో ఆవరణలో దాన్ని తెచ్చిపెట్టాడు.

నిప్పంటుకొని కాలిపోయిన పత్తి

రూ.10 లక్షల నష్టం



నరసాపురంలో కాలిన పత్తి

రుద్రవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరసాపురం గ్రామంలో సంజీవ్‌కుమార్ అనే రైతు ఆరబెట్టిన పత్తి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కాలిపోయింది. ఈ ఘటన సోమవారం జరిగింది. పత్తి తడిగా ఉంటే ఆరుబయట ఆరబెట్టామని, ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పత్తి కాలిపోయిందని రైతు తెలిపారు. దీంతో ఏడాదంతా చేసిన క ష్టం అగ్నిపాలై సుమారు రూ.10 లక్షల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. 20 క్వింటాళ్లను ఆరబెట్టగా సుమారు 10లక్షలు విలువ చేసే పత్తి కాలిపోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

వెల్దుర్తి టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం శ్రీరంగాపురం గ్రామానికి చెందిన జ్యోతిలక్ష్మి (20) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. జ్యోతిలక్ష్మికి అదే గ్రామానికి చెందిన గొల్ల శంకర ప్రసాద్‌తో వివాహమైంది. భర్త తాగుడుకు బానిసై వేధిస్తుండటంతో ఆమె తాళలేక ఈ నెల 3వ తేదీన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండు రోజుల చికిత్స తర్వాత కర్నూలులో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకపోయారు. అక్కడ కోలుకోలేక సోమవారం మృతి చెందింది. మృతురాలికి ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతురాలి తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

వెల్దుర్తి టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి పట్టణం ఐజీ నగర్‌కు చెందిన బుడగ జంగాల రవి (30) సోమవారం తెల్లవారుజామున ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడు రోజుల కింద రవి మద్యం తాగి భార్యతో గొడవ పడటంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. రెండు రోజులుగా భార్య రాకపోవడంతో మనస్తాపానికి గురై సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

కుష్ఠు వ్యాధిపై ఇంటింటి సర్వే



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కుష్ఠు వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2027 సంవత్సరం నాటికి కుష్ఠు వ్యాధిని నిర్మూలించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కుష్ఠు వ్యాధిపై ఇంటింటి సర్వే చేస్తారన్నారు. జిల్లాలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు ఇంటింటికి తిరిగి పరీక్షలు చేసి అవగాహన కల్పించాలని వైద్యాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కుష్ఠు, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి డా.ఎల్. భాస్కర్ జిల్లా న్యూక్లియస్ వైద్యాధికారి డా.జి. మల్లికార్జున రెడ్డి, డీపీఎంవోలు జి. విజయప్రకాష్, వై. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కౌన్సిలర్ భర్తకు రిమాండ్

బేతంచెర్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన మహిళను వేధించిన కేసులో వైసీపీ కౌన్సిలర్ భర్త నిరంజన్‌ను మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని ఎస్‌ఐ రమేష్‌బాబు సోమవారం తెలిపారు. సంజీవనగర్ కాలనీకి చెందిన ఒక మహిళ తనను నిరంజన్ వేధిస్తున్నాడని గత నెల 25వ తేదీన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని ఆయన తెలిపారు. ఈ మేరకు వైసీపీ కౌన్సిలర్ భర్త నిరంజన్‌పై కేసు నమోదు చేశామని, ఆయన పరారీలో ఉన్నాడని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం పట్టణంలోని పుల్లమ్మ కల్లం వద్ద నిందితుడు నిరంజన్‌ను అరెస్టు చేసి డోన్ కోర్టులో హాజరు పరచగా.. మేజిస్ట్రేట్ నిందితుడిని రిమాండ్‌కు ఆదేశించాడని ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

తెలియనితనం...!

- పెట్రోల్‌తో ఆటలాడిన ఇద్దరు చిన్నారులు
- మంటలు వ్యాపించి ఓ బాలుడికి తీవ్ర గాయాలు
- ఆస్పరి మండలం బిల్లేకల్లులో ఘటన



కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న అరవింద్

ఆస్పరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దేనితో ఆటలాడుతున్నామో.. దాని ప్రభావమెంతో ఎరుగని పసిపిల్లలు వాళ్లు.. పెట్రోల్‌కు నిప్పు తోడైతే మంటలు చెలరేగుతాయని.. ప్రాణాలకే ప్రమాదం అనే విషయం ఏమాత్రం తెలియని వయసు. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లాక ఇంటి సమీపంలో ఆడుకుంటూ రోడ్డు పక్కన ఆపిన మోటర్ బైక్‌లో నుంచి పెట్రోల్ తీశారు. ఓ ప్లాస్టిక్ సీసాలో పెట్రోల్ పోసుకుని ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. ఓ బాలుడు అగ్గిపుల్ల గీసివేయంతో క్షణాల్లో మంటలు వ్యాపించి ఎనిమిదేళ్ల పసిబాలుడు అరవింద్ శరీరమంతా చుట్టిముట్టాయి. ఈ సంఘటన ఆస్పరి మండలం బిల్లేకల్లు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకోగా సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, బాధిత చిన్నారి అరవింద్‌కు వరుసకు సోదరుడైన రామకృష్ణ తెలిపిన మేరకు వివరాలు... బిల్లేకల్లు గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, పెద్దయ్య దంపతులకు కుమార్తె పల్లవి, అరవింద్ సంతానం. మద్యానికి బానిసై లక్ష్మీదేవి భర్త పెద్దయ్య ఆరు నెలల క్రితం మృతి చెందాడు. భర్తను కోల్పోయిన లక్ష్మీదేవి అన్నితానై పిల్లలను పోషిస్తోంది. అరవింద్‌ను బడిలో చేర్పించాలని వెళితే ఆధార్ కార్డు లేదని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అడ్మిషన్ ఇవ్వలేదు. అయినా అక్క పల్లవితో కలిసి రోజు బడికి వెళ్లేవాడు. అదే గ్రామానికి చెందిన హెచ్. ఉరుకుంద కుమారుడు వికాస్ నాలుగో తరగతి చదువుతున్నారు. కాగా వికాస్, అరవింద్ ఇద్దరూ మంచి స్నేహితులు. గత శుక్రవారం లక్ష్మీదేవి కూలీ పనులకు వెళ్లింది. అక్కతో పాటు బడికి వెళ్లిన అరవింద్ మధ్యాహ్నం బయటకు వచ్చేశాడు. మిత్రుడు వికాశ్‌తో కలసి ఆడుకుంటూనే.. రోడ్డు పక్కన ఆపిన ద్విచక్ర వాహనంలో (మోటర్ బైక్) నుంచి పెట్రోల్ తీసి.. ఆ పెట్రోల్‌ను చెరో ప్లాస్టిక్ సీసాలో పోసుకొని.. ఆ సీసా మూతకు సూదితో రంధ్రం చేసుకొని ఒకరిపై ఒకరు రంగుల్లాగా చల్లుకున్నారు. ఆ క్రమంలో కింద పడిన పెట్రోల్‌కు అగ్గిపుల్ల వెలిగించి నిప్పు పెడితే అది ఆరిపోయింది. అట్లాగే మనిషిపై పడితే కూడా ఆరిపోతుందనుకొని వికాశ్ అగ్గిపుల్ల వెలిగించి.. అరవింద్‌పై వేశాడని స్థానికుల సమాచారం. మంటలు వ్యాపించడమే కాకుండా, జేబులో ఉంచుకున్న పెట్రోల్ సీసాకు కూడా మంటలు చేరి ఒక్కసారిగా భగ్గుమని శరీరమంతా వ్యాపించాయి. అయితే స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. చిన్నారి వికాశ్ ఏమాత్రం భయపడకుండా ధైర్యంతో నీళ్ల తీసుకొచ్చి అరవింద్ శరీరంపై పోయడంతో మంటలు ఆరిపోయాయి. కూలి పనులకు వెళ్లిన తల్లి లక్ష్మీదేవికి విషయం తెలియడంతో విలపిస్తూ ఇంటికి చేరుకుంది. బంధువుల సహాయంతో ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అరవింద్ ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఇద్దరు పిల్లలు సరదాగా ఆడుకుంటూ ఈ ఘటన జరిగిందని అరవింద్ సోదరుడు రామకృష్ణ ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఆస్పరి పోలీస్ స్టేషన్ సీఐ మస్తాన్‌వలి దృష్టికి తీసుకెళ్లగా ఇద్దరు పిల్లలు పెట్రోల్‌తో సరదాగా ఆడుకుంటూ ప్రమాదానికి గురై అరవింద్ అనే బాలుడు శరీరం కాలిన గాయాలతో ఆస్పత్రిలో చేరారని సమాచారం వచ్చిందన్నారు. ఈ ఘటనపై ఎవరు కూడా ఫిర్యాదు చేయలేదన్నారు.

బావిలో దూకి ఒకరు.. రక్షించేందుకు వెళ్లి మరొకరు

- 80బన్నూరు పొలిమేరలోని బావిలో పడి ఇద్దరి మృతి
- తుమ్మలూరులో విషాదం



ప్రమాదానికి కారణమైన పెద్దబావి ఇదే

మృతి చెందిన లక్ష్మీదేవి, నారాయణ (ఫైల్)

జూపాడుబంగ్లా, పాములపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బావిలో దూకిన మహిళతో సహా కాపాడడానికి వెళ్లిన వ్యక్తి కూడా మృత్యుతవాత పడ్డాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని 80బన్నూరు గ్రామ పొలిమేరలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. తుమ్మలూరు గ్రామానికి చెందిన లక్ష్మీదేవి(48) కొన్నేళ్ల నుంచి కాన్సర్‌తో బాధ పడుతోంది. వైద్య ఖర్చులు పెరిగిపోవడంతో మనస్థాపానికి గురై 80బన్నూరు సోమవారం గ్రామ పొలిమేరలో ఉన్న బావిలో దూకింది. ఇది గమనించిన అదే గ్రామానికి చెందిన తెలుగు లక్ష్మీనారాయణ(44) ఆమెను రక్షించేందుకు బావిలోకి దూకాడు. ఆమెను కాపాడే ప్రయత్నంలో అతను కూడా మృతి చెందాడు. లక్ష్మీనారాయణ మృతదేహం లభ్యం కావడంతో నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం చేయించారు. మహిళ మృతదేహం మాత్రం లభ్యం కాలేదు. ఇరువురు మృతి చెందడంతో తుమ్మలూరు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

13 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కర్నూలు కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం 13 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని ఎమ్మిగనూరు మండలంలోని టీఎస్ కల్లూరు గ్రామం, కోసిగి మండలంలోని కోసిగి, కౌతాళం మండలంలోని కామవరం, మంత్రాలయం మండలంలోని వగరూరు, పెద్దకడుబూరు మండలం పెద్దకడుబూరు, ఆదోని మండలం జి.హోసలి, గణేకల్లు, హొళగుంద మండలం పెద్ద గోనేహాల్ గ్రామం, కోసిగి మండలం పెండేకల్, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని తడకనపల్లి, కర్నూలు రూరల్‌లోని సుంకేసుల, పత్తికొండ రెవెన్యూ డివిజన్ ఆలూరు మండలం పెద్దహోతూరు, ఆస్పరి మండలంలోని ముత్తుకూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు.

16లోపు దరఖాస్తు చేసుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలు, ఈబీసీలకు స్వయం ఉపాధి కల్పించేందుకు జనవరి 8 నుంచి 16వ తేదీ వరకు ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సోమవారం తెలిపారు. ఈ మేరకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కల్పించేందుకు జిల్లాలో అర్హులైన బీసీ లబ్ధిదారులకు 1673 యూనిట్లు, ఆర్థికంగా వెనుకబడిన కులాలకు 171 యూనిట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ యూనిట్ల ఏర్పాటుకు బీసీ కార్పొరేషన్ ద్వారా 50 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయాల్సి ఉందన్నారు.

చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసు విచారణ ప్రారంభం

కర్నూల లీగల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ వైసీపీ నియోజకవర్గం ఇన్‌చార్జిగా పని చేసిన చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసు విచారణ సోమవారం స్థానిక జిల్లా సెషన్స్ కోర్టులో ప్రారంభమైంది. 2017 మే 21న చెరుకులపాడు నారాయణరెడ్డిపై క్రిష్ణగిరి మండలంలో దాడి జరిగింది. ఈ దాడిలో నారాయణరెడ్డితోపాటు అతని అనుచరుడు సాంబశివుడు కూడా హత్యకు గురయ్యారు. నారాయణరెడ్డి అనుచరుడు కృష్ణమోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు 18 మంది నిందితులపై కేసు నమోదు చేశారు. అయితే.. కేసులో నిందితులుగా పేర్కొన్న ప్రస్తుత పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, కప్పట్రాళ్ల బొజ్జమ్మల పేర్లను హైకోర్టు ఆదేశాలతో తొలగించారు. కేసులో నిందితుడుగా ఉన్న ఒక వ్యక్తి మృతి చెందగా.. మిగతా 15 మందిపై సోమవారం విచారణ జరిగింది. కేసులో ఫిర్యాది అయిన కృష్ణమోహన్ ప్రాసిక్యూషన్ తరఫున తన వాంగ్మూలాన్ని కోర్టులో ఇచ్చారు. తదుపరి విచారణకు కేసు వాయిదా పడింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలు

దేవనకొండ,జనవరి 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు- బళ్లారి రహదారిపై కప్పట్రాళ్ల సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. విద్యుత్‌పనులు చేసేందుకు బీహార్ నుంచి వచ్చిన షకుర్ అనే వ్యక్తి ఆటోలో వెళ్తుండగా ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయపడడంతో ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కబడ్డీ విజేత విశాఖపట్నం

రన్నర్ కర్నూలు



విజేత విశాఖపట్నం బాయ్స్‌కు కప్ అందజేస్తున్న కేఈ ప్రభాకర్

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మూల్పూరి రంగారావు స్మారక 50వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాల బాలికల కబడ్డీ చాంపియన్ పోటీల్లో విశాఖపట్నం జట్టు విజేతగా నిలిచి డబుల్ క్రౌన్ సాధించింది. రన్నర్‌గా కర్నూలు బాలబాలికలు నిలిచారు. కర్నూలు డీడీపాడు కేఈ ప్రభాకర్ ఫాంహౌస్‌లో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో విశాఖపట్నం బాలుర జట్టు కర్నూలుపై 27-25 పాయింట్లతో నెగ్గింది. మూడో స్థానంలో చిత్తూరు, నాల్గవ స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో విశాఖపట్నం జట్టు కర్నూలుపై 37-30 పాయింట్లతో విజయం సాధించింది. చిత్తూరు జట్టు తృతీయ స్థానం సాధించింది. విజేతలకు టోర్నమెంటు అధ్యక్షుడు కేఈ ప్రభాకర్, కేవీ సుబ్బారెడ్డి, మల్లికార్జున రెడ్డి టోర్నమెంటు కప్‌ను అందజేశారు. ఈసీఎం నీలకంఠయ్య, మాజీ కబడ్డీ సంఘం కార్యదర్శి రాజశేఖర్ ప్రస్తుత కార్యదర్శి సుభాకర్, డీఎస్‌డీవో భూపతిరావు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్లకు ఏవోలుగా పదోన్నతి

కర్నూలు న్యూసిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న ఎనిమిది మంది సీనియర్ అసిస్టెంట్లకు పరిపాలనా అధికారులుగా పదోన్నతి కల్పిస్తూ జడ్పీ సీఈవో నాసరరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జడ్పీ కార్యాలయంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చేతుల మీదుగా పరిపాలనా అధికారులు నియామక పత్రాలను అందుకున్నారు. కర్నూలు పీఐయూ డివిజన్‌లో పని చేస్తున్న ఎన్. భాగ్యలక్ష్మిని ప్యాపిలి పరిపాలన అధికారిగా పీఆర్ డివిజన్ ఆదోనిలో పని చేస్తున్న ఎం. నాగరాజు స్వామి, పెద్దకడుబూరు ఎంపీడీవో, పీఆర్ డివిజన్ నంద్యాలలో పని చేస్తున్న భరణి కుమారిని ఎంపీడీవో కోవెలకుంట్ల, కర్నూలు పీఆర్ఐ డివిజన్‌లో పని చేస్తున్న ఎంజీ నాగేంద్ర కుమార్‌ను పగిడ్యాల ఎంపీడీవో, మిడ్తూరు ఎంపీడీవోగా పని చేస్తున్న శ్రీరాములు అవుకు ఎంపీడీవో, ఆత్మకూరు పీఐయూ సబ్ డివిజన్‌లో పని చేస్తున్న అబ్దుల్ కలాంబాషాను ఎంపీడీవో డోన్, ఆదోని పీఐయూ సబ్ డివిజన్‌లో పని చేస్తున్న రవీంద్రబాబును ఎంపీడీవో హాలహర్వి, కల్లూరు ఎంపీడీవోలో పని చేస్తున్న ఎస్. హేమలతను కర్నూలు డ్వామా కార్యాలయంలో నియమిస్తూ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

కారు బోల్తా.. ఒకరి మృతి

- నలుగురికి తీవ్ర గాయాలు
- మృతదేహం వెంట వెళ్తుండగా ప్రమాదం

కోడుమూరు రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కారు బోల్తా పడి ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని కొత్తూరు వద్ద సోమవారం రాత్రి జరిగింది. కోడుమూరు మండలంలోని కల్లపరి గ్రామానికి చెందిన పెద్దయ్య కర్నూలులో నివాసం ఉంటున్నాడు. ఆయనకు గుండెపోటు రావడంతో బంధువులు ఆసుపత్రికి చేరుకున్నారు. పెద్దయ్య చికిత్స పొందుతూ మృతి చెందడంతో మృతదేహాన్ని అంబులెన్స్‌లో కల్లపరికి పంపించి ఆ వెనుకనే కారులో మిగిలిన కుటుంబ సభ్యులు బయల్దేరారు. అయితే కొత్తూరు వద్ద రోడ్డుపై కుక్క కళేబరం తప్పించబోయి కారు రోడ్డు పక్క పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో పెద్దయ్య బావమరిది కోడుమూరు ఎస్సీ కాలనీకి చెందిన జయన్న (62) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య కృపాలమ్మ, కొడుకు గిడ్డయ్య, కూతుళ్లు సులోచనమ్మ, పుష్పావతమ్మ, మనువడు విజయ్(పుష్పావతమ్మ కొడుకు), సోదరి సంతోషమ్మ (మృతుడు జయన్న భార్య) గాయపడ్డారు. వీరిలో గిడ్డయ్య, కృపాలమ్మ, సంతోషమ్మ, విజయ్ అనే నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన చేరుకుని గాయపడిన వారిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెద్దయ్య, జయన్న మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

పరిస్థితి విషమం

హొళగుంద, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : హొళగుంద గ్రామానికి చెందిన మల్లమ్మ అనే వృద్ధురాలిని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన సోమవారం జరిగింది. మల్లమ్మ హొళగుంద గ్రామ శివారులోని తమ పొలానికి వెళ్తుండగా వెనకవైపు నుండి అతివేగంగా గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె రెండు కాళ్ళు, కుడి చేయి విరిగిపోయాయి. తలకు సైతం తీవ్రగాయాలయ్యాయి. హొళగుంద పీహెచ్‌సీ కేంద్రానికి తరలించగా పరిస్థితి విషమించడంతో ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు పోలీసుల ఫిర్యాదు చేశారు.

ప్రజల సౌకర్యార్థం రోడ్డు నిర్మిస్తాం: మంత్రి



రోడ్డు నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం పట్టణంలో రోడ్డు నిర్మిస్తామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని దేవనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతి పాదించిన స్థలాన్ని మంత్రి ఫరూక్ పరిశీలించారు. ఇక్కడ రోడ్డు నిర్మిస్తే కొన్ని గృహాలు కోల్పోయామని మంత్రి దృష్టికి స్థానికులు తీసుకువచ్చారు. గృహాలు కోల్పోకుండా ప్రజల సౌకర్యార్థం ఉండేలా రోడ్డు నిర్మిస్తామని చెప్పారు. మంత్రి వెంట కౌన్సిలర్లు జైనాబీ, దస్తగిరి, సాయిరాం రాయల్, పబ్బతి వేణుగోపాల్ తదితరలు పాల్గొన్నారు.

వేతన సవరణ చేయాలి

పాములపాడు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు వేతన సవరణ చేపట్టాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా అన్నారు. సోమవారం పాములపాడులో స్థానిక ఎంఈవో బాలాజీ నాయక్‌తో కలిసి పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను విడుదల చేసి సహచర మిత్రులకు తోటి ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 శాతం ఐఆర్ మధ్యంతర భృతి, పెండింగ్ డీఏలను చెల్లించాలని, సంక్రాంతి సెలవుల్లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న వంద రోజుల కార్యక్రమం సెలవుల్లో విరామం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ మదన్‌బాబు, రాష్ట్ర నాయకులు దామరేకుల రవి, జిల్లా నాయకులు వెంకటసుబ్బయ్య, మహిళా నాయకులు ద్రాక్షాయిణి బాయి, ప్రధానోపాధ్యాయులు గోపాల్ పాల్గొన్నారు.

తూముల మరమ్మతులు చేపడతాం

బండిఆత్మకూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్ బ్లాక్‌లు, తూములకు దెబ్బతిన్న చోట్ల మరమ్మతులు చేపడతామని కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి అన్నారు. సోమవారం ఆయన అధికారులతో కలిసి మండలంలోని ఎర్రగుంట్ల సమీపంలోని కేసీ కెనాల్ తూములను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు నీటి పారుదలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని అన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా చూస్తామని తెలిపారు. కేసీ, గంగ కింద రబీ సీజన్ పంటలకు సాగు నీరందిస్తామని రైతులకు ఆయన హామీ ఇచ్చారు. వెంట ఏఈలు మహేశ్వరెడ్డి, వెంకటేశ్వర్లు, నాయకులు జగన్మోహన్‌రెడ్డి, సిద్ధయ్య, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తర్తూరు గ్రామానికి చెందిన శిరోమణి అనే మహిళకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.81 వేలు మంజూరయ్యాయి. చెక్కును శిరోమణి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జయసూర్య అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు యాదవ్, రమణారెడ్డి, మోహన్ రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, ఎంపీడీవో గోపికృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేయాలి

నంద్యాల రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేయాలని అల్‌మదద్ ఫౌండేషన్ చైర్మన్ ఆకుమళ్ల రహీం డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని భారత్ స్కూల్‌లో కరస్పాండెంట్ రహేళ్లమ్మ ఆధ్వర్యంలో ఉర్దూ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రహీం మాట్లాడుతూ దేశంలోనే ఉర్దూభాషకు ఎంతో ప్రాచుర్యం వచ్చిందని అన్నారు. అధికార భాషల్లో ఉర్దూ ఒకటని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిని ఉర్దూ కోర్సులో చేర్పించి భాషాభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

నంద్యాల కల్చరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాకయులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్మికులు సుదీర్ఘ పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును గత ప్రభుత్వం నిర్వీర్యం చేసి 1214 మెమోను తీసుకు వచ్చిందని అన్నారు. దీని వల్ల గత ఐదేళ్లలో ఒక్క కార్మికుడికి కూడా న్యాయం జరగలేదన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్ క్లెయిమ్స్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. పక్క దారి పట్టించిన రూ.1281 కోట్లను తిరిగి వెల్ఫేర్ బోర్డుకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిమ్మయ్య, మున్నా కృష్ణా, మహబుబ్‌భాసా, ఇంతియాజ్ రాము పాల్గొన్నారు.

ఆ భూమిని రద్దు చేయాలి

గడివేముల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గని గ్రామంలో 165/2 సర్వే నంబర్‌లో మాజీ సైనికుడికి కేటాయించిన భూమిని రద్దు చేయాలని సర్పంచ్ తులశమ్మ, ఎంపీపీ నాగమద్దమ్మ, మాజీ సర్పంచ్ వైవీవీ ప్రసాద్, గ్రామస్థులు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 165/2 సర్వే నంబర్‌లోని భూమిలో పూర్వం నుంచి పార్వేట ఉత్సవాలు నిర్వహించుకుంటున్నామని అన్నారు. 2013లో గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండానే రెవెన్యూ శాఖ ఓ మాజీ సైనికుడికి ఐదు ఎకరాల భూమికి పట్టా ఇచ్చిందని అన్నారు. 2008, 2018 సంవత్సరంలో 165/2 సర్వే నంబర్‌లో పశువులకు తాగునీటి కోసం జాతీయ ఉపాధి హామీ పథకం కింద కుంటను కూడా తవ్వించుకున్నామని తెలిపారు. పశువులకు తాగునీటి కోసం వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. అధికారులు స్పందించి మాజీ సైనికుడికి కేటాయించిన పట్టాను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, మద్దిలేటి, అన్సర్‌బాషా, సాయిశేఖర్ పాల్గొన్నారు.



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ ఇస్తున్న గని గ్రామ సర్పంచ్, గ్రామస్థులు

బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు చర్యలు: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయం భవనంలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. పీజీఆర్‌ఎస్ వేదికలో భాగంగా వివిధ అభివృద్ధి అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ రక్త నిల్వ కేంద్రంలోని ల్యాబ్ మెడికల్ పరికరాల కోసం కలెక్టరేట్ నుంచి రూ.15 లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల నిధులతో బ్లడ్ రిఫ్రిజిరేటర్స్ సెంట్రిఫ్యూజ్, జీరో టీడీఎస్ ప్లాంట్ ఏర్పా టుతోపాటు థైరాయిడ్ టెస్ట్ నిర్వహించే పరికరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు నిర్ణీత గడువులోగా సంబంధిత వ్యక్తులకు పంపిణీ చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పర పతి సంఘాలు ఈకేవైసీ పూర్తి చేసి కంప్యూటరీకరించేలా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఆత్మకూరు పట్టణంలో నిర్వహించే తబ్లీగ్ ఇజ్‌తేమా కార్యక్రమ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయడంతోపాటు, వైద్య శిబిరాలు, విధులు నిర్వహిస్తున్న డ్యూటీ సిబ్బందికి డ్యూటీ పాసు లు మంజూరు చేయాలని సంబంధిత అధికారు లను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో పదో తరగతి చదువు తున్న 22500 మంది విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత సంవత్సరం పదో తరగతి పరీక్షల ఉత్తీర్ణత శాతంలో 19వ స్థానంలో ఉన్నామని గుర్తు చేస్తూ, సాధన, సంకల్ప బలం ఉంటే వంద శాతం ఉత్తీర్ణత సాధించడం కష్టమేమి కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్ పాల్గొన్నారు.

- కుష్ఠు వ్యాధి నిర్ధారణ కోసం ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఇంటింటి సర్వే కార్యక్రమం చేపడుతున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ లో భాగంగా కుష్ఠి వ్యాధి నిర్మూలన గోడ పత్రికను జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, వైద్యాధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, లెప్రసి ఎయిడ్స్ టీబీ అధికారి డా.శారదాబాయి, పారామెడికల్ ఆఫీసర్ ఈజాబుల్‌హక్ తదితరులు పాల్గొన్నారు.
- హౌసింగ్ బోర్డు కాలనీలోని నివాసితుల స్థలాల భద్రతకు భరోసా కల్పిస్తూ కలెక్టర్ రాజకుమారి ఉత్తర్వుల ప్రతులను పంపిణీ చేశారు. సోమవారం జేసీతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.

ప్రజా సమస్యలపైనే ప్రభుత్వం దృష్టి: ఎమ్మెల్యే

పాణ్యం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. సోమవారం జరిగిన పాణ్యం మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మండలంలో ఎన్నో యేళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను పరిష్కరించడానికై టీడీపీ ప్రభుత్వం దాదాపు రూ.15 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఇందులో పాణ్యం, దుర్వేశి క్రాస్ రోడ్డు వరకు బీటీ రోడ్డుకు రూ.4.60 కోట్లు, గగ్గ టూరు మునుకుందు వాగు వంతెనకు రూ.3 కోట్లు, వద్దెల వాగు వంతెనకు రూ.2 కోట్లు, గోరుకల్లు రిజర్వాయర్ మరమ్మతులకు రూ.64 లక్షలు, తమ్మరాజుపల్లె యేటిపాయ పర్క్యులేషన్ ట్యాంకు నిర్మాణానికి రూ.1.50 కోట్లు, నీరు చెట్టు కింద ఎస్సార్బీసీ కాలువల మరమ్మతులకు రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. మండలంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తమ్మరాజుప ల్లెలో సర్వీసు రోడ్డు పూర్తి చేయాలని, ఏటిపాయ నిర్మాణం చేపట్టాలని, శ్మశానం రహదారి నిర్మాణానికి నిధులు పెంచి పూర్తి చేయాలని సర్పంచ్ విజయగౌరి కోరారు. కౌలూరు సమీపంలో ఎస్సార్బీసీ నీటితో పంట భూములు ముంపునకు గురి కావడంతో బీడుగా మారాయని, ఎంపీటీసీ నల్లల భాస్కరరెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. అనంతరం నూతన సచివాలయం, ఆర్బీకే, ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు. పాణ్యం ఆర్టీసీ బస్టాండు వద్ద మరుగు దొడ్ల నిర్మాణం చేపట్టకపోవ డంపై ఎమ్మెల్యే గౌరు చరిత ఆర్టీసీ ఆర్‌ఎం రజియా సుల్తానాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే వ్యవసాయ మార్కెట్ యార్డును పరిశీలించారు. పాణ్యం సామాజిక ఆరోగ్య కేంద్రం కమిటీ సమావేశంలో పాల్గొని ఆసుపత్రిలోని సౌకర్యాలు పరిశీలించారు. ఇటీవల ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరగ డంతో వైద్యాధికారి డాక్టర్ రహేలాను అభినం దించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, తహశీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీపీ ఉశేన్‌బీ, సర్పంచ్ పల్లవి, ఉపసర్పంచ్ చంద్రశేఖరరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి పాల్గొన్నారు.



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

పల్లకిలో విహరించిన మహా నందీశ్వరుడు



మహానందిలో పల్లకి సేవ ఉత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

మహానంది, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో పరమ శివునికి ప్రీతి వంతమైన సోమవారం రాత్రి ఘనంగా పల్లకి సేవ ఉత్సవం ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండ పంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేక పల్లకిలో ఆశీనులు గావించారు. ప్రత్యేక పూజలను వేదమంత్రాలతో జరిపారు. అనంతరం ఆలయ మొదటి ప్రాకారంలో భక్తుల శివనామస్మరణ మధ్య పల్లకి సేవ ఉత్సవం మేళతాళాలతో జరిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బందితో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహానందిలో రథాన్ని పరిశీలించిన ఈవో

మహానంది, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో వచ్చే నెలలో జరిగే మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని అమావాస్య రోజు ఆలయం చుట్టూ తిరిగే భారీ రథాన్ని సోమవారం ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఏడాదికి ఒకసా రి మహానందిలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని రథం ఆలయం చుట్టూ తిరిగేందుకు వీలుగా ఎలాంటి మరమ్మతులు చేప ట్టాలనే అంశంపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. కొద్దిపాటి చిన్న చిన్న మరమ్మతులు చేపట్టాలని గుర్తించారు. దీని కోసం తిరుప తి జిల్లా శ్రీకాళహస్తి నుంచి ప్రత్యేక నిపుణులతో రథానికి మరమ్మ తులు చేపట్టి వచ్చే మహా శివరాత్రి నాటికి పూర్తి చేస్తామని ఈవో చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎర్రమల్ల మధు, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు యాదవ్, సీనియర్ అసిస్టెంట్ పసుపుల సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

గడివేముల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచాలకట్ట గ్రామానికి చెందిన సురేంద్ర, ఆళ్లగడ్డ గ్రామానికి చెందిన విజయ్‌లపై పైబోగుల గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. సురేంద్ర, విజయ్‌లు మద్యం సేవించి కిరాణా సరుకుల కోసం వెంకటసుబ్బయ్య షాపునకు వెళ్లారు. షాపు మూసి వేస్తున్నామని, ఉదయం రమ్మని చెప్పడంతో మాట మాట పెరిగింది. దీంతో కోపోద్రిక్తులైన సురేంద్ర, విజయ్‌లు రాడ్డుతో వెంకటసుబ్బయ్యపై దాడి చేశారు. అడ్డుకోబోయిన వెంకట సుబ్బయ్య తల్లి నారాయణమ్మపై దాడి చేశారు. కిరాణం షాపు షట్టర్‌ను, ఆటో అద్దాలను పగలగొట్టారని బాధితుడు ఫిర్యాదు చేశాడని అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మహానంది, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం బుక్కాపురం గ్రామ సమీపంలోని ప్రధాన రహదారి అలుగు వద్ద మోటార్ సైకిల్‌ను ట్రాక్టర్ ఢీ కొనడంతో బైక్‌పై ఉన్న పాములేటి తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం తన సొంత పని ముగించుకొని తిరిగి నంద్యాల నుంచి మోటార్ బైక్‌పై స్వగ్రామం తిమ్మాపురం వస్తున్న పామలేటిని మార్గమధ్యలోని బుక్కాపురం ప్రధాన రహదారి అలుగు వద్ద నంద్యాల వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పామలేటిని స్థానికులు 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

శ్మశానానికి స్థలం చూపాలి

మహానంది, జనవరి 6 (ఆంధ్ర జ్యోతి): మహానంది మండలం గాజుల పల్లి ఆర్‌ఎస్‌లో శ్మశానానికి స్థలం కేటాయించాలని గ్రామస్థులు తహసీల్దార్ పి.రమాదేవిని కోరారు. సోమవారం మహానందిలోని మండల రెవెన్యూ కార్యాలయంలో గ్రామానికి చెందిన సుధాకర్, శ్రీనివాసులు, రఫీ, దినేష్, రాజు, చిరంజీవి తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. 617 సర్వే నెంబర్‌లోని రెండు ఎకరాల స్థలంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. అయితే కొద్ది కాలం క్రితం మండలంలోని గోపవరానికి చెందిన బత్తుల చిన్న నాగన్న శ్మశానానికి చెందిన స్థలం తనది అని నంద్యాల మండలం పాండురంగాపురం గ్రామానికి చెందిన నవీన్‌రెడ్డికి విక్రయించాడని తెలిపారు. దీంతో మృతదేహాలను పూడ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు.

జిల్లా సహకార బ్యాంకు మార్పు

పాణ్యం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార కేంద్ర బ్యాంకును సోమవారం స్టేట్ బ్యాంకు సమీపంలోని నూతన భవనంలోకి మార్చినట్లు బ్యాంకు మేనేజరు రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అసిస్టెంట్ మేనేజరు శ్రీనాథరెడ్డి కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజలు చేశారు.

20 ఏళ్ల తర్వాత కలిశారు..!



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

మిడుతూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మిడుతూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పూర్వ విద్యార్థులు సోమవారం 20 సంవత్సరాల తరువాత ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2004- 2005 సంవత్సరంలో పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు గడి చిన తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాలను ఎదిగినందుకు ఉపాధ్యా యులు ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్య అతిథులుగా హెడ్ మాస్టర్ సాయితిమ్మయ్య, శేషయ్య, అప్పటి ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

10న జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 10వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం జాబ్‌మేళా బ్రోచరను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 10న జరిగే ఈ జాబ్‌మేళాకు పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు ఈ జాబ్‌మేళాకు హాజరు కావచ్చునని చెప్పారు. మరిన్ని వివరాలకు 6303244165, 767302328 నంబర్లను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ పద్మావతిబాయి తదితరులు ఉన్నారు.

లబ్ధిదారులను పరిశీలించిన వైద్య బృందం

ఆత్మకూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బోగస్ పింఛన్ల ఏరివేతలో భాగంగా ఆత్మకూరు డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో ప్రత్యేక వైద్య బృందం పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను పరిశీలించారు. అనంతపురం జిల్లాకు చెందిన ఆర్థోపెడిక్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, జనరల్ మెడిసిన్ ఎండీ డాక్టర్ నాగార్జునరెడ్డితోపాటు డేటా ఎంట్రీతో కలిపిన బృందం కొత్తపల్లి మండలంలోని ఎదురుపాడు, ఆత్మకూరు పట్టణంలో పర్యటించారు. తొలి రోజు డేటీ ఎంట్రీ సర్వర్ ప్రాబ్లమ్ కావడంతో ఎదురుపాడు గ్రామంలోని ఇద్దరిని మాత్రమే పరిశీలించారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో 10, ఆయా గ్రామాల్లో 11 మంది చొప్పున మొత్తం 21 మంది లబ్ధిదారులు ఉండగా ఆత్మకూరులోని పట్టణంలోని ఏకలవ్యనగర్, కిషన్‌సింగ్ ఏరియాల్లో ఏడుగురిని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. వీరి వెంట బైర్లూటి, గోకవరం ప్రాథమిక వైద్య కేంద్రాల వైద్యులు డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ విజయేంద్ర ఉన్నారు.

ఓటర్ల తుది జాబితా విడుదల



ఓటర్ల తుది జాబితా వివరాలను వెల్లడిస్తున్న తహసీల్దార్ రత్న రాధిక

ఆత్మకూరు రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు శ్రీశైలం నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను వెల్లడించినట్లు తహసీల్దార్ రత్నరాధిక పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ తుది జాబితాను వెల్లడించారు. శ్రీశైలం నియోజకవర్గంలో 1,96597 మంది ఓటర్లు ఉండగా అందులో 95,960 మంది పురుష ఓటర్లు, 1,00,593 మంది మహిళ ఓటర్లు, థర్డ్ జెండర్ ఓటర్లు 44 మంది ఉన్నట్లు తెలిపారు. శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలంలో 63,250 మంది, బండి ఆత్మకూరులో 38,138 మంది, మహానందిలో 29,853 మంది, శ్రీశైలంలో 22899 మంది, వెలుగోడు మండలంలో 42,457 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఆయా ఓటర్ల జాబితాను ఆయా పార్టీల రాజకీయ నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, వైసీపీ, సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

మోదీ పర్యటనకు వ్యతిరేకంగా నేడు నిరసన

నందికొట్కూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ పర్యటనను నిరసిస్తూ మంగళవారం నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన చట్టంలో భాగంగా పదేళ్లు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో పాటు వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ఏడు జిల్లాలకు ప్రతి సంవత్సరం జిల్లాకు రూ.50 కోట్లు ఇవ్వాలని, లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పడమే ఒక్కటి కూడా అమలు చేయలేదని అన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీకి ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదని విమర్శించారు. పూటకో మాట మార్చి రాష్ట్ర ప్రజలను మోసం చేసిన నరేంద్ర మోదీ ఈ నెల 8వ తేదీన ఆంధ్ర రాష్ట్రంలో పర్యటించడం విచారకరమన్నారు. ఆయన పర్యటనను నిరసిస్తూ నందికొట్కూరు పట్టణంలో చేపట్టే నిరసన కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజలు పెద్దఎత్తున హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో గోపాలకృష్ణ, ఉస్మాన్‌బాషా పాల్గొన్నారు.

అధికారికంగా నిర్వహించాలి

నంద్యాల రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వడ్డె ఓబన్న జయంతిని కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి చల్లా వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ వడ్డె ఓబన్న బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ దళాలతో వీరోచితంగా పోరాడి స్వాతంత్ర్య సాధన కోసం కృషి చేశారన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరాటంలో ఓబన్న సైన్యాధ్యక్షుడి పాత్ర పోషించి ప్రాణాలకు తెగించి దేశం కోసం పోరాడారని, ఓబన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. జనవరి 11వ తేదీలోపు కూటమి ప్రభుత్వం ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించేం దుకు జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మహిళా సమాఖ్య అధ్యక్షురాలి మృతి

మిడుతూరు, జనవరి 6(ఆంధ్ర జ్యోతి): మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన శ్యామలమ్మ (34) సోమవారం అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న ఏపీఎం సబ్బయ్య, సీసీలు, వీఓఏలు, వెలుగు సిబ్బంది తిమ్మాపురం గ్రామం చేరుకుని శ్యామలమ్మ మృతదే హానికి పూల మాలలు వేసి సంతాపం తెలియజేశారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపి ఆర్థిక సహాయం అందజేశారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

షిరిడీ సాయిబాబా ఆలయం డోన్‌కే తలమానికం

13న విగ్రహ ప్రతిష్ఠ

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేత



మంత్రికి బొకే అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

డోన్ రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణ సమీపంలోని జాతీయ రహదారి సమీపంలో నిర్మిస్తున్న షిరిడీ సాయిబాబా ఆలయం డోన్‌కే తలమానికంగా నిలవనుంది. ఏడు సంవత్సరాల క్రితం మొదలు పెట్టిన ఆలయ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. దాతల ఆర్థిక సహకారాలతో ఆలయాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే నెల 9నుంచి 13వరకు షిరిడీ సాయిబాబా ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సన్నాహాలు చేస్తున్నారు. కార్యక్రమానికి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మను బనగానపల్లెలో షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, సీఎం శ్రీనివాసులు, నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి తదితరులు కలిసి ఆహ్వానించారు. 13న షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యుడు సీ.ఎం.శ్రీనివాసులు తెలిపారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన బాధితులకు సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన రూ.5.43 లక్షల చెక్కులను ఎమ్మెల్యే సోమవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు చెక్కులు అందుకున్న బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

యాగంటిలో పల్లకి సేవ

బనగానపల్లె , జనవరి 6 (ఆంధ్రజ్యోతి: బనగానపల్లె మండలంలోని ప్రముఖయ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకి సేవ ఉత్సవం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ ఈవో చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, మౌళీశ్వరరెడ్డితో పాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకీలో శ్రీ ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పల్లకిసేవ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు.

పింఛన్‌దారులను పరిశీలించిన వైద్య బృందం

ప్యాపిలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుదొడ్డి, చిన్నపూదిళ్ల, పెద్దపూదిళ్ల, ప్యాపిలి, మాందొడ్డి, గుడిపాడు, కలచట్ల, మెట్టుపల్లి గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధితో రూ.15వేల పింఛన్ తీసుకుంటున్న వారిని సోవారం వైద్యబృందం పరిశీలించింది. ఆయాగ్రామాల్లో 26మంది పింఛన్‌దారులను వైద్యబృందం పరిశీలించింది. వైద్యులు మాధవి, ఎల్లోజీ, వాణీశ్రీ పరిక్షలు నిర్వహించిన వారిలో ఉన్నారు.

ఆస్పత్రిలో అన్నదానం

బేతంచెర్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శేషారెడ్డి సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణిలు, బాలింతలు, రోగులకు అన్నదాన కార్యక్రమాన్ని సోమ వారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ సభ్యులు మారం పవన్ కుమార్ సహకారంతో ఆసుపత్రిలో రోగులకు ఆరోగ్య సిబ్బందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సుర మధు సుధాకర్ రెడ్డి, రాజు, మాజీ అధ్యక్షులు వలిబాషా, శివ, గోపాల్ రెడ్డి, రిజ్వాన్ లయన్స్ క్లబ్ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సర్పంచ్‌కు ఇచ్చే గౌరవం ఇదేనా..?

- అన్నీ తానై చక్రం తిప్పుతున్న ఉప సర్పంచ్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తెలుగు తమ్ముళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న పెనుగొండ రాజశేఖర్

కోవెలకుంట్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో ఉప సర్పంచ్‌గా వ్యవహరిస్తున్న వైసీపీ నాయకుడు జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి తీరుపై తెలుగుదేశంపార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఎన్నుకున్న మహిళా సర్పంచ్ ఉన్నప్పటికీ ఆమెను పక్కనబెట్టి అధికారం చెలాయించడం ఎంత వరకు సమంజసమని టీడీపీ నాయకులు సోమవారం ప్రశ్నించారు. కోవెలకుంట్ల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల యువజన నాయకులు పెనుగొండ రాజశేఖర్, లాయర్ శ్రీకాంత్, మురళి, మోహన్‌రెడ్డి, నాగేంద్ర, దాబా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మేజరు గ్రామ పంచాయతీలో అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఈవోఆర్‌డీ ప్రకాశ్ నాయుడును భయభ్రాంతులకు గురి చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. ఆరోపణలు మాని అభివృద్ధి చేసే అధికారులకు సహకరిస్తే కోవెలకుంట్ల పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఖాజాబాషా, రాజు తదితరులు పాల్గొన్నారు.

'బోను పరికరాలు పక్కనపడేశారు'

రుద్రవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి. లింగందిన్నె గ్రామంలో పశువులకు వైద్యమందించే బోను పరికరాలను పక్కనపడేశారు. ఇలాగైతే పశువులకు వైద్యం ఎలా అందిస్తారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పశువైద్యాధికారులకు ఫిర్యాదు చేసినా అలాగే పక్కనపడేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పశువులకు వైద్యం అందించడానికి ఇబ్బందిగా ఉందంటున్నారు. ఇలాగైతే ఎలా అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

'ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా వేదిక లక్ష్యం'

బేతంచెర్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ ప్రకాష్‌బాబు తెలిపారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక వీడియో కాన్ఫరెన్స్ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏమైనా సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి ప్రజలు తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫజిల్ రెహమాన్, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, ఎంఈవో సోమశేఖర్, విద్యుత్ ఏడీ మధుసూదన్ రెడ్డి, రూరల్ ఏఈ శ్రీనివాసులు, మండల వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు కత్తెర పురుగు

- ఆకులను తినేస్తున్నవైనం
- ఆందోళనలో రైతులు





చాగలమర్రిలో కత్తెర పురుగుతో దెబ్బతిన్న మొక్కజొన్న, పురుగుమందు పిచికారి చేస్తున్న రైతు

చాగలమర్రి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పంటలు సాగు చేసే రైతన్నకు ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో నష్టాలు పాలవుతున్నారు. ఈ ఏడాది రబీ సీజన్ ప్రారంభంలోనే రైతులు మొక్కజొన్న పంటను బోర్లు, కాలువ కింద అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. మొక్కజొన్న పంటకు కత్తెరపురుగు సోకడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చింతల చెరువు, శెట్టివీడు, పెద్దవంగలి, ముత్యాలపాడు, గొడిగనూరు, పెద్దబోదనం, చిన్నబోదనం, నేలంపాడు, చాగలమర్రి తదితర గ్రామాల్లో 3 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. పంట ఏపుగా పెరిగి పచ్చగా ఉండటంతో అధిక దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. పంటకు విపరీతంగా కత్తెర పురుగు సోకింది. దీంతో పచ్చని పైరు తెల్లబారి వాడిపోతోంది. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేశారు. కత్తెర పురుగు దాడితో పంట దెబ్బతిని నష్టపోవాల్సి వచ్చింది. వాతావరణ ప్రభావంతో పురుగు అధికమై పంటను దెబ్బతీసింది. సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే పంట పూర్తిగా కోల్పోవాల్సి ఉంటుందని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. కత్తెర పురుగు మొదట్లో ఆకులను తింటుందని, ఆ తరువాత సుడిలోకి ప్రవేశించి కాండం తొలచి తినేస్తోందని రైతులు వాపోతున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి పురుగు మందులతో పిచికారి చేస్తున్న పురుగు చావడం లేదని రైతులు విలపిస్తున్నారు. పురుగు నివారణకు సూచనలు, సలహాలు ఇవ్వాలని వ్యవసాయశాఖను రైతులు కోరుతున్నారు.

పురుగు తినేస్తోంది



10 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. ఎకరాకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టా. నెల రోజుల్లోపు పంట ఏపుగా పెరిగింది. కత్తెరపురుగు ఆశించడంతో పంట దెబ్బతిని ఆకులు పండుబారుతున్నాయి. తుఫాన్ ప్రభావంతో తెగుళ్ల అధికమై పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- నాగభూషణం, రైతు, చాగలమర్రి

తుఫాన్‌తో నష్టపోతున్నాం



ఈ ఏడాది తుఫాన్ వల్ల సాగు చేసిన పంటలు దెబ్బతిని నష్టపోతున్నాం. 10 ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న పంట సాగు చేశా. పంటకు కత్తెర పురుగు తినేస్తోంది. ఎన్ని మందులు వాడిన పురుగు చావడం లేదు. పురుగు నివారణకు వ్యవసాయశాఖ సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది.

- మహబూబ్‌బాషా, కౌలురైతు, శెట్టివీడు

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మొక్కజొన్న పంటకు అధిక నష్టం కలిగిస్తున్న కత్తెర పురుగు నివారణ కోసం మొక్క రెండు, మూడు ఆకుల దశలో ఉండగానే 1500 పీపీఎం వేప మందు పిచికారి చేసుకోవాలి. పొలంలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి.

- రంగనేతాజీ, ఏవో, చాగలమర్రి

పరిసరాలు శుభ్రంగా ఉండాలి

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- నూతన ఆర్టీసీ బస్సులు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె, జనవరి 6, (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు శుభ్రంగా ఉండాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో కొత్తగా వచ్చిన రెండు ఆర్టీసీ బస్సులను మంత్రి ప్రారంభించారు. బనగానపల్లె నుంచి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సును నడపనున్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సును బనగానపల్లె నుంచి తిరుపతి వరకు నడపనున్నారు. అనంతరం ఆర్టీసీ పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. తాగునీటి ట్యాంకు వద్ద మురుగునీరు ఉండడం, మరుగుదొడ్ల అపరిశుభ్రంగా ఉండడంతో డీఎం రవికిశోర్‌పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్టాండ్ ఆవరణంలో చెత్తాచెదారం వేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమైన విషయమన్నారు. టాయిలెట్లు, బస్టాండ్ ఆవరణం అంతా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బస్టాండ్‌లో కొత్త నిర్మాణాల గురించి ఆర్టీసీ అధికారులతో మంత్రి చర్చించారు. అలాగే ఖాళీగా ఉన్న స్థలాల్లో టెండర్లు పిలిచి ఆర్టీసీ ఆదాయాన్ని పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు అధికారి రజియా సుల్తానా, కంట్రోలర్ వెంకటన్న, వాసు, ఆర్టీసీ సిబ్బంది, టీడీపీ నాయకులు టంగు టూరు శ్రీనయ్య, వంగాల పరమేశ్వర రెడ్డి, కాట్రెడ్డి మల్లిఖార్జున్ రెడ్డి, సంగు శ్రీనివాసరెడ్డి. యాగంటిపల్లె దస్తగిరి, మౌళీశ్వరరెడ్డి, బాబయ్య, భూషన్న, ఇస్మాయిల్ ఖాన్, సలాం, కృష్ణానాయక్, రహిమాన్, గోపాల్‌రెడ్డి, నియాజ్, అహమ్మద్ హుసేన్, బొబ్బల మహేశ్వరరెడ్డి, దివాకర్‌రెడ్డి, శిల్పా సుబ్రమణ్యం, టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్ పరిశీలన

బనగానపల్లె పట్టణంలోని యాగంటిపల్లె రహదారిలోని నూతనంగా నిర్మించనున్న గెస్ట్ హౌస్ నిర్మాణం పనుల ప్లాన్‌ను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. సంబంధిత అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. అలాగే శిథిలావస్థలో ఉన్న గెస్టు హౌస్‌ను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ శాఖ ఈఎన్‌సీ నయీముల్లా, ఎస్‌ఈ పీ.మహేశ్వరరెడ్డి, ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈ సునీల్‌రెడ్డి, ఏఈ హుసేన్, ఇతర ఆర్‌అండ్‌బీ అధికారులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం కార్యాలయానికి వందలాదిగా ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి అర్జీలను మంత్రికి అందజేశారు. రాత్రి పొద్దుపోయే వరకు దరఖాస్తులను స్వీకరించి వాటి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలనుంచి ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఏకాదశి ఉత్సవాలు



పూజలందుకుంటున్న మద్దిలేటి స్వామి

బేతంచెర్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మద్దిలేటి నరసింహ స్వామి క్షేత్రంలో ఈ నెల 8 నుంచి 11 వరకు ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయని, ఉత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈవో రామాంజనేయులు సోమవారం తెలి పారు. ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు వివరాలు ఇలా ఉన్నాయని వెల్లడించారు. 8న శుద్ధ నవమి పురస్కరించుకుని ఉదయం 6 గంటలకు స్వామివారి ప్రత్యేక పూజలు, రాత్రి 7 గంటలకు హనుమద్ వాహనంపై స్వామి వారి ఊరేగింపు ఉంటుందని, అలాగే రాత్రి 9 గంటలకు గుంతకల్లు వారిచే ఘంటసాల సంగీత విభావరి, వివిధ పాటల రసమయలాపన, నంద్యాల శ్రీసాయి ఆర్కెస్ట్రా ఈవెంట్ ఉంటుందని ఆయన వివరించారు. 9న స్వామి అమ్మవారికి నిత్యపూజ కార్యక్రమాలు , సాయంత్రం 4 గంటలకు మంటపారాధన, గజ వాహనంపై స్వామి, అమ్మవార్ల వేంచేపు, మహా మంగళహారతి తీర్థప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. రాత్రి 7 గంటలకు గజ వాహనం పై స్వామివారి ఊరేగింపు, రాత్రి 9 గంటలకు భక్త చింతామణి పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. పదవ తేదీన ముక్కోటి ఏకాదశి తెల్లవారు జామున 3.30 గంటల నుంచి నరసింహ స్వామి ధృవమూర్తికి మహోన్నవన తిరుమంజనం, చందనాలంకరణ సేవ, విశేష పుష్పాలంకరణ ఉంటుందన్నారు. అనంతరం అభిజిత్ లగ్న శుభపుష్కరాంశంలో శ్రీభూ, నీల సమేత గణ మద్దిలేటి నరసింహస్వామి వార్ల మహోత్సవం నీరాజనం తీర్థప్రసాద వినియోగం ఉంటుందన్నారు. సాయంత్రం 4 గంటలకు ఆర్‌ఎస్ రంగాపురంలో స్వామి, అమ్మవార్ల రథోత్సవం ఉంటుందన్నారు. 11న ఉదయం పూజలు, చక్రస్నానం, తెప్పోత్సవం కన్నుల పండువగా నిర్వహిస్తారు. ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కుష్ఠు ప్రాణాంతక వ్యాధి కాదు



సిబ్బందికి సూచనలు, సలహాలు ఇస్తున్న జగదీష్ చంద్రారెడ్డి

చాగలమర్రి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు ప్రాణాంతకమైన వ్యాధి కాదని జిల్లా వైద్యశాఖ నోడల్ అధికారి జగదీష్‌చంద్రారెడ్డి అన్నారు. సోమవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో ఆశాడే సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ వరకు లెప్రసీ కేసుల గుర్తింపు, ఇంటింటి సర్వేపై అవగాహన కల్పించారు. రెండో విడత కుష్ఠువ్యాధి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించాలని అన్నారు. ఆయా లక్షణాలు గల వారిని గుర్తించాలని, అనుమానిత లెప్రసీ కేసులను నమోదు చేయాలని అన్నారు. ఎన్‌సీబీసీడీ సర్వేను వేగవంతం చేయాలని అన్నారు. క్యాన్సర్, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి యాప్‌లో నమోదు చేయాలని, అనుమానిత కేసులను వైద్యశాలకు పంపించాలని సూచించారు. వారంలో 5 రోజులు 5 కుటుంబా లు తక్కువ కాకుండా సర్వే చేయాలని అన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది విధులు బాధ్యాతాయుతంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు అంజలి, సీహెచ్‌వో రమణమ్మ, హెచ్‌ఈ వెంకటమ్మ, సూపర్ వైజర్ రామలింగారెడ్డి, ముత్యాలపాడు వైద్యశాఖ విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు కూరగాయలతో ఆరోగ్యం

చాగలమర్రి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ సాగుతో పండించిన కూరగాయలు తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయం మండల యూనిట్ నిర్వాహకులు నాగేశ్వర్‌రెడ్డి, ఖదీర్‌బాష, నిరంజన్‌ల ఆధ్వర్యంలో ఆకుకూరలు, కూరగాయలను ప్రజలకు అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో ఐటీఆర్పీలు నాగేంద్రబాబు, తిరుమలయ్య, బాబు, రవి, లక్ష్మీనర్సమ్మ, వీరభద్రుడు పాల్గొన్నారు.

'ఆక్రమణకు గురికాకుండా కాపాడండి'

ఉయ్యాలవాడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భవనాలు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని ఆర్.జంబులదిన్నె గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి కోరారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో జరిగిన ప్రజా వేదికలో ఎంపీడీవో ఉమమహేశ్వరరావుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వ పాఠశాలలోని వంట గదిని ఆక్రమించుకొని, గొర్రెలకు ఆశ్రయంగా మార్చాడన్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భవనాన్ని కాపాడాలని కోరానన్నారు.

'షెడ్లను వినియోగంలోకి తెస్తాం'

కొలిమిగుండ్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మాణం పూర్తి చేసుకొని ఖాళీగా ఉన్న వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్‌లను వినియోగంలోకి తీసుకరానున్నట్లు ఈవోఆర్డీ శివప్రసాద్ వెల్లడించారు. సోమవారం మండల కేంద్రమైన కొలిమిగుండ్ల సమీపంలో ఏర్పాటుచేసిన వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ వద్దకు రహదారి పనులు చేపట్టారు. అదేవిధంగా షెడ్డు వద్ద పేరుకుపోయిన కంపచెట్లు, చెత్తను కూడా తొలగించినట్లు వారు వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించండి

కొలిమిగుండ్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బందార్లపల్లె గ్రామం నుంచి తాడిపత్రి రహదారిలో ఉన్న అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తిచేశారు. సోమవారం తాడిపత్రి ఆర్టీసీ డిపో మేనేజర్ శంకరయ్యను గ్రామస్థులు యాతం కళ్యాణ్‌రెడ్డి, చంద్రహాసన్‌రెడ్డి, రాఘవ, వీరాంజి, బాలస్వామి తదితరులు కలిసి వినతిప్రతం అందించారు. గ్రామంలో 80మంది విద్యార్థులు అంకిరెడ్డిపల్లె పాఠశాలకు వెళుతున్నారని, వీరంతా కాలినడకన, నాపరాళ్ల ట్రాక్టర్లలో పాఠశాలకు చేరుకుంటున్నారని వివరించారు. వీరికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

ఏపీజీబీ నూతన శాఖ ప్రారంభం

ఉయ్యాలవాడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు నూతన భవనాన్ని ఆ బ్యాంకు జనరల్ మేనేజర్ గిరి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ రమణ, బ్రాంచ్ మేనేజర్ హరీష్, నాయకులు తదితరులున్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

'పది'లో వందశాతం ఉత్తీర్ణతకు కృషి

- చాగలమర్రి ఎంఈవో-1 అనూరాధ



చాగలమర్రి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నట్లు ఎంఈవో-1 అనూరాధ తెలిపారు. వంద రోజుల ప్రణాళికతో, కొత్త విధానాలతో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామని, ప్రత్యేక తరగతులపై దృష్టి సారించామని అన్నారు. సోమవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు?

జవాబు: మండలంలో 1 నుంచి 10వ తరగతి వరకు 8,087 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలలో 552 మంది, ప్రైవేట్ పాఠశాలలో 207 మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు.

ప్రశ్న: డ్రాపౌట్స్ సంఖ్య ఎలా ఉంది ?

జవాబు: మండలంలో డ్రాపౌట్స్ సంఖ్య 134 మందిని గుర్తించాం. వారిలో 103 మందిని చేర్పించాం.

ప్రశ్న: ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?

జవాబు: విద్యార్థులకు యూనిఫాం, బూట్లు, పుస్తకాలు పంపిణీ చేశాం. అందరి వారిని గుర్తించి అందజేస్తున్నాం. 5,276 మంది విద్యార్థులకు హోలిస్టిక్‌కార్డులు పంపిణీ చేశాం.

ప్రశ్న: ఉపాధ్యాయుల కొరత ఉందా?

జవాబు: మండలంలోని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. అయితే సర్దుబాటు ద్వారా ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. మరికొన్ని ఖాళీలను సర్దుబాటు ద్వారా భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు చేశాం.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న వార్డెన్

డోన్ రూరల్, జనవరి 6 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు దుప్పట్లను వార్డెన్ ఎన్.మధు అందజేశారు. చలికాలం కావడంతో ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లను కేటాయించింది. ఇందులో భాగంగా పట్టణంలోని బీసీ బాలుర సంక్షేమ హాస్టల్‌కు 205, ఎస్సీ బాలుర సంక్షేమ హాస్టల్‌కు 113 దుప్పట్లు రా గా, రెండు హాస్టళ్లకు చెందిన వార్డెన్ ఎన్.మధు సోమవారం విద్యార్థులకు అందజేశారు.

మురుగునీరు వెళ్లేందుకు కాల్వ ఏర్పాటు

బీసీ హాస్టల్‌లో రూ.20వేల వ్యయంతో మురుగునీరు వెళ్లేందుకు కాల్వ నిర్మిస్తున్నారు. వార్డెన్ మధు కాల్వ నిర్మాణ పనులు సోమవారం పరిశీలించారు.విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా మురుగునీరు హాస్టల్ నుంచి బయటకు వెళ్లేందుకు కాల్వ నిర్మాణ పనులు చేపట్టినట్లు వార్డెన్ తెలిపారు.

9న వాసవీ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

చాగలమర్రి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని వాసవీ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలో 9న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ షాబుద్దిన్ తెలిపారు. సోమవారం కళాశాలలో జాబ్‌మేళా కరపత్రాలను విడుదల చేశారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

10న జాబ్‌మేళా

డోన్ రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): డోన్‌లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొనే జాబ్‌మేళాను నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు, రేపు ప్రజాభిప్రాయ సేకరణ

డోన్ రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ మంగళవారం నుంచి చేపడుతున్నట్లు డోన్ ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నాగేంద్ర తెలిపారు. 7, 8 తేదీల్లో విజయవాడ నుంచి ఏపీఈఆర్‌సీకి చెందిన ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తారన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ రెండు రోజుల్లో ఈ కార్యాలయానికి వచ్చి తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

హామీలను నెరవేర్చాలి: సీపీఐ

డోన్ రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నాయుడు నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, మోటరాముడు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో ఆ పార్టీ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ నెల 10న ఇళ్ల స్థలాల కోసం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

17న వైద్య బృందం రాక

కోవెలకుంట్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.15వేలు పింఛను తీసుకునే లబ్ధిదారులకు వైద్యపరీక్షలు నిర్వహించేందుకు ఈ నెల 17న వైద్యబృందం వస్తున్నట్లు ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని బిజినవేముల, కలుగొట్ల, కోవెలకుంట్ల, రేవనూరు, సౌదరిదిన్నె గ్రామాల్లో మొత్తం 21 మంది ఈ రూ.15వేలు పింఛను పొందుతున్నారన్నారు. ఈ పింఛనుదారులకు రెండురోజుల ముందు నోటీసు ఇస్తామన్నారు. నోటీసులు అందుకున్న వారు అందుబాటులో ఉండి వైద్యపరీక్షలకు సహకరించాలని అన్నారు.

15 వరకు పంట నమోదు గడువు పెంపు

కోవెలకుంట్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : రబీలో రైతులు సాగు చేసిన వరి పంటకు పంటల బీమా గడువు ఈ నెల 15వరకు పొడిగించినట్లు మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరి పంట సాగు చేసిన రైతులు ఇంత వరకు పంటల బీమా చేయించుకోని వారు ఆర్‌బీకే వద్దకు వెళ్లి పంటల బీమా చేయించుకోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు

చాగలమర్రి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామం లోని చెన్నకేశవ, కోదండరామ, పట్టాభిరామ ఆలయంల్లో ధనుర్మాస పూజలను వేద పండితుల ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ముద్దూరు గ్రామంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో వేద పండితుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయా కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పాదయాత్రికుడికి ఘన స్వాగతం

ప్యాపిలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ పరిరక్షణ కోసం శివకిరణ్ సింగ్ అనే యువకుడు చేపట్టిన పాదయాత్రకు సోమవారం ప్యాపిలిలో సరస్వతి శిశుమందిర ఆచారులు, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. 2022 మార్చి 25న ఉత్తరప్రదేశ్ ఫతేపూర్ జిల్లా ఖరోలి నుంచి తన పాదయాత్రను ప్రారంభించారు. ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, హిమాచల ప్రదేశ్, చండీఘర్, జమ్మూకాశ్మీర్‌ల మీదుగా ఢిల్లీ చేరు కొని రాష్ట్రపతి ద్రౌపతిముర్మును కలవనున ట్లు యువకుడు తెలిపారు.